ప్రజాశక్తి
బుధవారం 18 డిసెంబరు, 2024 5
శ్రీకాకుళం

జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ కార్యాలయం సంయుక్తంగా నిర్వహించారని అన్నారు. ఈ జాబ్‌మేళాకు 40 మంది నిరుద్యోగులు హాజరు కాగా, వీరిలో 13 మంది ఎంపికయ్యారని అన్నారు. మంజూశ్రీ టెక్నో పాయింట్, రుయా లాబ్స్, విరాట్‌మోడీ సోలార్ సిటీ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

వర్షం గుబులు


టెక్కలి : ధాన్యం రాశులపై టార్పాలిన్లు వేసిన రైతులు

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. నూర్పులు ఉధృతంగా సాగుతున్న సమయంలో వర్షాలు కురవడంతో అన్నదాతల్లో గుబులు రేగుతోంది. జిల్లాలో వచ్చే నాలుగు రోజులో కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో మరింత కలవరపడుతున్నారు. మంగళవారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై రాత్రికి వర్షాలు ప్రారంభమయ్యాయి. మరోవైపు తీవ్ర చలిగాలులు వీచాయి. వర్షాలు పడుతుండడంతో పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు నిమగ్నమయ్యారు. పొలాల్లో ఎండబెట్టడం కోసం ఉంచిన ధాన్యాన్ని ఇళ్లకు తరలిస్తున్నారు. ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

- నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం
- జిల్లాలో పలుచోట్ల కురుస్తున్న వర్షాలు
- మరో నాలుగు రోజుల పాటు వానలు పడతాయని హెచ్చరిక
- రైతులకు టార్పాలిన్లు అందించేందుకు ఏర్పాట్లు చేసిన అధికారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

అల్పపీడన ప్రభావంతో రాత్రి ఎనిమిది గంటల సమయానికి లావేరు మండలం తామాడలో అత్యధికంగా 4 మి.మీ వర్షం కురిసింది జి సిగడాంలో 2.75 మి.మీ, నిమ్మాడలో 2 మి.మీ, సారవకోటలో 1.75 మి.మీ, సరుబుజ్జిలి మండలం విజయరామపురంలో 1.25మి.మీ వర్షం పడింది. జలుమూరు ఒక మి.మీ, శ్రీకాకుళం నగరంలో 0.75 మి.మీ,రణస్థలం మండలం గరికపాలెం, టెక్కలి మండలం రావివలస, నరసన్నపేటలో అర మి.మీ మేర వర్షం కురిసింది. లావేరులో మూడు, నాలుగు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. చాలాచోట్ల వరి కోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల పంట కోసి కుప్పలుగా పోశారు. జిల్లాలో ముమ్మరంగా నూర్పులు చేపడుతున్నారు. వర్షాలు పడతాయన్న వార్తల నేపథ్యంలో పంటను కాపాడుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. జిల్లాలో ఈ ఏడాది 3,59,495 ఎకరాల్లో వరి పంట సాగైంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 403 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో పలు మండలాల్లో ధాన్యం అమ్మేందుకు రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఇప్పటివరకు సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు.

రైతులకు అందుబాటులో టార్పాలిన్లు : జెసి

జిల్లాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ రైతులకు సూచించారు. రైతు సేవాల కేంద్రాల ద్వారా టార్పాలిన్లు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఒక్కో టార్పాలిన్‌కు రూ.650 డిపాజిట్ చెల్లించి తీసుకోవాలని రైతులకు సూచించారు. తర్వాత వాటిని అప్పగిస్తే ఆ మొత్తాన్ని తిరిగి అందజేస్తామని తెలిపారు. రైతులు తాత్కాలికంగా ధాన్యాన్ని భద్రపరుచుకోవడానికి దగ్గర్లో ఉన్న ప్రభుత్వ భవనాలు లేక మార్కెట్ యార్డులను రైతులు ఉపయోగించుకొనవచ్చునని ఆయన సూచించారు.

డిస్ట్రిబ్యూటరీలూ ఏకపక్షమే

- పదవులన్నీ టిడిపి కూటమి సానుభూతిపరుల పరం
- 16 కమిటీలకు ఎన్నికలు పూర్తి
- 21న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు


పోలాకి: డిసిలను అభినందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మంగళవారం నిర్వహించిన సాగునీటి డిస్ట్రిబ్యూటరీ సంఘాల (డిసి) ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలోని 16 డిసిలకు కొత్త అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. తొలుత అధ్యక్ష ఎన్నికలను పూర్తి చేసి తర్వాత ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించారు. పోటీ లేకపోవడంతో అన్నిచోట్లా ఏకగ్రీవమయ్యాయి. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ పదవులన్నీ టిడిపి కూటమి సానుభూతిపరుల పరమయ్యాయి. కొత్తగా ఎన్నికైన ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లకు ఎమ్మెల్యేలు, పలువురు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. డిసిల ఎన్నికల పూర్తికావడంతో ఈ నెల 21న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో అధికారులు అందుకనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలోని 16 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు కొత్త అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకునేందకు నిర్వహించిన ఎన్నికలు సజావుగా సాగాయి. తొలుత అధ్యక్ష పదవులకు ఎన్నిక ప్రక్రియ ప్రారంభించారు. ఉదయం తొమ్మిది గంటలకు నామినేషన్లను స్వీకరించారు. అన్నిచోట్ల ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో అధ్యక్షునిగా ఎన్నికయినట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం ఉపాధ్య పదవికి నామినేషన్లను స్వీకరించారు. ఆ పదవులకూ అన్నిచోట్లా సింగిల్ నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ప్రకటించారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలకు ఇటీవల గెలుపొందిన 98 సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు ఓటర్లుగా హాజరయ్యారు.

21న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నిక

డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు పూర్తి కావడంతో ప్రభుత్వం ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 21 ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. జిల్లాలో వంశధార, నారాయణపురం ప్రాజెక్టులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జలుమూరు మండలం పర్లాం, నరసన్నపేట మండలం నరసన్నపేట, పోలాకి మండలం పోలాకి, సంతబొమ్మాళి మండలం గోవిందపురం, మేఘవరం, టెక్కలి మండలం నౌపడ, వజ్రపుకొత్తూరు మండలం వజ్రపుకొత్తూరు, శ్రీకాకుళం మండలం సింగుపురం, ఎల్ఎన్‌పేట మండలం ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలం సరుబుజ్జిలి, గార మండలం అంపోలు డిసిలు వంశధార ప్రాజెక్టు పరిధిలోకి రానున్నాయి. కొత్తగా ఎన్నికైన డిసిల అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్నారు. ఆమదాలవలస మండలంలో కొర్లకోట, పొందూరు మండలం తాడివలస, గోరింట, ఎచ్చెర్ల మండలం పొన్నాడ, శ్రీకాకుళం మండలం అరసవల్లి డిస్ట్రిబ్యూటరీలు నారాయణపురం ప్రాజెక్టు పరిధిలోకి రానున్నాయి. కొత్తగా ఎన్నికైన డిసిల అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్నారు.

సఫాయి కర్మచారుల సంక్షేమంపై దృష్టి

జాతీయ కమిషన్ సభ్యులు పి.పి వావా



మాట్లాడుతున్న వావా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సఫాయి కర్మచారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సక్రమంగా అమలు చేయాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు పి.పి.వావా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులు, సఫాయి కార్మికులు, ఆయా సంఘాల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సఫాయి కర్మచారులు అందించే సేవలు అమూల్యమైనవని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం చేయాలని అన్నారు. సమాజం ఆరోగ్యంగా ఉండాలని కష్టపడే సఫాయి కర్మచారీలకు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థికసాయం, బ్యాంకు రుణాలు అందించాలన్నారు. వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని సూచించారు. ప్రతి మూడు నెలలకొకసారి వైద్య శిబిరాలను నిర్వహించి వారికి వైద్య సేవలందించాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రెయిన్ శుభ్రపరిచే కార్మికుల జీతం పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ కనీస వేతనాలు దక్కేలా చట్టాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లలో కర్మచారులను నియమించి వారికి ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను అందించాలని ఆదేశించారు. అనంతరం ఆయన జిల్లాలో సఫాయి కర్మచారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో, మున్సిపాలిటీల్లో, గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సఫాయి కర్మచారులకు వేతన స్లిప్, పిఎఫ్, ఇఎస్ఐ, బీమా అందిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్లు ఈ సందర్భంగా తెలిపారు. సమావేశానికి వచ్చిన సఫాయి కర్మచారుల సంఘం ప్రతినిధులు తమకు రుణాలు, ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. దీనిపై జాతీయ కమిషన్ సభ్యులు పీపీ వావా స్పందిస్తూ... తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ వాహనాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, నగర కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, సోషల్ వెల్ఫేర్ డిడి విశ్వమోహన్ రెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడ్డమ్మ, జిల్లా పరిషత్ సిఇఒ శ్రీధర్‌రాజా, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, డిఇఒ తిరుమల చైతన్య, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా, విక్రయాలపై నిఘా

విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ జెట్టి


శ్రీకాకుళం అర్బన్ : రికార్డులను పరిశీలిస్తున్న డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో యథేచ్ఛగా గంజాయి అక్రమ రవాణాకు జిల్లా రాచ మార్గమవుతోందని, అందువల్ల పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి రవాణాతోపాటు క్రయవిక్రయాలకు అడ్డుకట్ట వేయాలని విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ జెట్టి ఆదేశించారు. నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డితో కలిసి మంగళవారం వార్షిక తనిఖీ చేపట్టారు. ముందుగా ఆయన పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, క్రిమినల్ కేసులు, ఎన్‌డిపిఎస్, సైబర్ క్రైమ్, మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, హత్యా నేరాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో చేపట్టిన మహిళలతో ముఖాముఖి పాల్గొని మాట్లాడారు. మహిళా పోలీసుల పరిధిలోని గ్రామ, వార్డు స్థాయిలో నెలకొంటున్న అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలపాలని సూచించారు. సమాజంలో అనేక మంది ప్రజలు సైబర్ నేరగాల వలలో చిక్కుకొని మోసపోతున్నారని, సైబర్ నేరాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. దొంగ తనాలు, ఆర్థిక నేరాల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు వీటిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సకాలంలో పోలీసులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. సైబరు నేరగాళ్ల వలలో పడకుండా తక్షణమే 1930 టోల్ ఫ్రీ నంబరు ద్వారా ఫిర్యాదు చేయించాలన్నారు. మహిళా పోలీసులు ప్రజలతో మంచి సంబంధాలు ఏర్పరచుకోవాలన్నారు. పాఠశాల కళాశాలల పరిసరాల్లో గంజాయి విక్రయాలు గుర్తిస్తే తక్షణమే పోలీసులకు తెలియజేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల్లో అత్యధిక శాతం మత్తు పదార్థాలు వినియోగం వల్లేనని, అందువల్ల మత్త పదార్థాలు వినియోగిస్తున్న వారిపై కచ్చితమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని అత్యాశకు పోయి సైబర్ నేరాగాళ్ల చేతిలో మోసపోవద్దని జిల్లా ప్రజలకు సూచించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని అడ్డుకట్ట వేసేందుకు ఈగల్ టాస్క్ ఫోర్స్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. విశాఖపట్నం రేంజ్ పరిధిలో సుమారు 41 ఎకరాల గంజాయి సాగును గుర్తించినట్టు తెలిపారు. సరిహద్దుల్లో నిఘా పెంచి గంజాయి రవాణాను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం పట్టణ డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, వన్‌టౌన్ సిఐ పైడిపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: గంజాయి అక్రమ రవాణ, క్రయవిక్రయాలపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డితో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. మాదవద్రవ్యాలపై గ్రామాల్లో, కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహనా సదస్సులు నిర్వహించి చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి డిఎస్‌పి మూర్తి, సిఐ కె.శ్రీనివాసరావు, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నౌపడ ఎస్ఐలు వి.సత్యనారాయణ, సింహాచలం, జి.నారాయణస్వామి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు


సమీక్షిస్తున్న ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ అప్పారావు

- జిల్లాలో 3 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 1831 మంది అభ్యర్థులు
- గుర్తింపు కార్డులు తప్పనిసరి
- ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ అప్పారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో బుధవారం నుంచి 23 వరకు నిర్వహించనున్న డిపార్ట్‌మెంటల్ పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ ఎం.అప్పారావు తెలిపారు. కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖాధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఎచ్చెర్లలోని శివాని ఇంజినీరింగ్ కళాశాల, వెంకటేశ్వర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, నరసన్నపేట కోర్ టెక్నాలజీస్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఈ పరీక్ష రాసేందుకు 1831 మంది అర్హత పొంది ఉన్నట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఆదేశించారు. అభ్యర్థులు వారి సర్వీసు రూల్స్ పుస్తకాలు తప్పక తీసుకురావాలన్నారు. గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దన్నారు. ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రెటరీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ రోజూ ఉదయం 10 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ పరీక్షలు ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నపత్రం ఉంటుందని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.అమ్మాజీ, హెచ్.సెక్షన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి శిక్షణ



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంకల్ప్ ప్రాజెక్టులో భాగంగా ఆసక్తి గల నిరుద్యోగ యువతకు ఔత్సాహి క పారిశ్రామిక శిక్షణా కార్యక్రమం ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రాంగణంలో నిర్వహించ నున్న ఈ శిక్షణలో ఆసక్తి గల 50 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో వ్యాపారం మొదలు పెట్టడానికి కావాల్సిన ప్రాథమిక అంశాలు, పరిశ్రమల అనుమతులు, బ్యాంకుల నుంచి సాయం తదితర సమాచారం, ముద్ర, పిఎం ఇజిపి రుణాలు పొందడానికి అవసరమైన సమాచారం యువ తకు శిక్షణ సమయంలో అందిస్తామని అన్నారు. అభ్యర్థులకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించి శిక్షణ అనంతరం ధ్రువపత్రాలను ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 7989177887 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

శ్రీకాకుళాన్ని రెండు మండలాలుగా విభజించాలి

రెవెన్యూ మంత్రిని కోరిన ఎమ్మెల్యే శంకర్


రెవెన్యూ మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం రెవెన్యూ మండలంలో పనిభారం అధికంగా ఉండడంతో అర్బన్‌గా, రూరల్ మండలాలుగా విభజించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. విశాఖపట్నంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొగదాలపాడును రెవెన్యూ విలేజ్‌గా మారుస్తూ మ్యాప్ సిద్ధం చేయాలని కోరామన్నారు. వీటితో ఎల్‌పిఎం నంబర్లతో సబ్ డివిజన్ చేయడానికి రైతుల నుంచి రూ.550 వసూలు చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. రెవెన్యూ మంత్రి స్పందిస్తూ ఎల్‌పిఎం నంబర్లకు రైతులెవ్వరూ ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారని తెలిపారు. పూర్తిగా ఉచితంగా రైతులకు ఎల్‌పిఎం నంబర్లకు ఇస్తామని చెప్పారని అన్నారు. మంత్రి దృష్టికి తీసుకెళ్లిన అన్ని అంశాలపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

సస్యరక్షణతో పంటల దిగుబడి

వ్యవసాయశాఖ జెడి కె.త్రినాథస్వామి


ఆమదాలవలస : మాట్లాడుతున్న జెడి త్రినాథస్వామి

ప్రజాశక్తి- ఆమదాలవలస

సస్యరక్షణ పద్ధతులతోనే పంటల దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయశాఖ జెడి కె.త్రినాథస్వామి అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేటలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెసర, మినుము, రాగులు వంటి పంట మార్పిడి వల్ల భూసారం పెరిగి ప్రధాన పంటల్లో దిగుబడి పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. పెసర, మినుము పంటల్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడంతో రకరకాల సమస్యలు ఎదురవుతాయని అన్నారు. సరైన సమయంలో కలుపు నివారణ చేయడం వల్ల బంగారు తీగ రకరకాల తెగుళ్ల సోకుతాయన్నారు. రైతులు సరైన యాజమాన్య పద్ధతుల్లో సాగుచేస్తే వాణిజ్య పంటలతో సమానంగా ఆదాయాన్ని పొందవచ్చునని సూచించారు. రబీ సీజన్‌లో పండించే అపరాలు సాగుపై రైతులు పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై తగు సూచనలు సలహాలను అందించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎడి బగ్గు రజిని, మండల ఎఒ మెట్ట మోహనరావు, ఎంపిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని బిర్లంగి, తోటూరు గ్రామాల్లో మండల ఎఒ భార్గవి మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబి పంటలకు ఇన్సూరెన్స్, కొనుగోలు విధానాలను తెలియజేశారు. రెండు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్ష సూచన ఉందని, పొలాల్లో కోసిన చేను ఉంటే కుప్పలైన పెట్టుకోవాలన్నారు. నూర్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

సోంపేట : భారీ సూచన నేపథ్యంలో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఎఒ నరసింహమూర్తి సూచించారు. మండలంలోని పాత్రకొండ, కర్తలిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ధాన్యం బస్తాలు సిద్ధమైతే వెంటనే రైతు సేవ కేంద్రాల ద్వారా మిల్లులకు పంపించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వాతావరణంలో జరిగే మార్పులకు అనుగుణంగా రైతులు సంరక్షణ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం, చిత్రాడ శ్రీనివాసరావు, కుమారి, ఉష, నవీన్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

డ్వామా పీడీ సుధాకరరావు



మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

ప్రజాశక్తి- పోలాకి

విధి నిర్వాహణలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ బి.సుదాకరరావు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో ఉపాధి హామీ ద్వారా 2023-24లో మండలం నిర్వహించిన పనులపై మంగళవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు పాల్గొని మాట్లాడారు. మండలంలో ఈ ఏడాది నిర్వహించిన పనులపై ఎటువంటి ఆరోపణలు లేకపోవడం అభినందనీయమన్నారు. సిబ్బంది ప్రజలకు పనులు కల్పించడంలో అంకిత భావంతో విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఈ ఏడాది మండలంలో కూలీలు చెల్లింపులు ద్వారా రూ.21,24,830,65, అలాగే పంచాయతీ శాఖ ద్వారా రూ.2 కోట్లు ఖర్చులపై గత నెల 28 నుంచి ఈ నెల 16 వరకు పంచాయతీల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారన్నారు. ఈ జాబితాలను డిఆర్‌పిలు చదివి వినిపించారు. ఎక్కువ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, సాంకేతిక సహాయకులు గ్రామస్థాయిలో పనులు కల్పించడంలో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వచ్చాయిన మబగాం, తలసముద్రం, వనితమండలం పంచాయతీల్లో పనులకు కూలీలు హాజరైనట్లు, గొల్లలవలస పంచాయతీలో 30 మంది కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్ పనులు కల్పించలేదని ఫిర్యాదులు అందాయి. ఈదులవలస పంచాయతీలో 200 మొక్కలు నాటితే 2 మొక్కలు మాత్రమే బతికి ఉన్నాయని నివేదిక ద్వారా వివరించారు. ఇలా 31 పంచాయతీల్లో మాస్టర్లపై కూలీల సంతకాలు లేవని, ఎస్టిమేట్లు ప్రకారం పనులు చేపట్టలేదని నివేదికలో పేర్కొన్నారు. పై నివేదికను పరిశీలించి పీడీ అసహనం వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, సాంకేతిక సహాయకులు, మేట్లు చేసిన తప్పిదాలపై రూ.2,05 లక్షలు రికవరీలు, మరికొందరికి రూ.78,500 ఫైన్లు విధించారు. పీడీ మాట్లాడుతూ రోజూ పనులు వద్దకి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిడి పి.రాధ, ఎంపిడిఒ జి.రవికుమార్, ఎపిఒ రమణారావు, ఎస్ఆర్‌పి పున్నంనాయుడు, డిఆర్‌పిలు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

టిసిలకు సన్మానం

సోంపేట : గ్రామస్థాయిలో రైతులు నీటి సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అశోక్ అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సోంపేట మండలంలోని కొర్లాం గ్రామ నీటి సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాంబుడ్డి జానకిరావ్, ఎం.చిరంజీవి, సభ్యులతో పాటు ఎంజీపురం నీటి సంఘ అధ్యక్షుడు ఉత్తరాల బ్రహ్మానందం తదితరులను కలిసి మాట్లాడారు. అనంతరం వారికి ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో మద్దీల నాగేశ్వరరావు, రామ్ బుడ్డి గణపతి, ఆర్.వెంకటరమణ, టి.వాసుదేవరావు, డి.మాధవరావు, సంతోష్, ప్రతాప్ పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి

ఆక్రమణలపై దర్యాప్తు

టెక్కలి : మండలంలోని అక్కవరం పంచాయతీ శ్యాంసుందరాపురం వద్ద నిర్మిస్తున్న జగనన్న కాలనీలో స్థలాలు మంజూరులో ఆక్రమణలు చోటు చేసుకున్నాయని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తికి ఫిర్యాదులు వచ్చాయి. ఆర్‌డిఒ ఆదేశాల మేరకు తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి ఆధ్వర్యాన విఆర్‌ఒల బృందం మంగళవారం దర్యాప్తు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి పట్టాలను పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుమారు 400 మంది లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేశామని, ఆక్రమణలు ఉంటే ఉపేక్షించేది లేదని తహశీల్దార్ స్పష్టం చేశారు.



పరామర్శిస్తున్న రాజేష్

ఉపాధ్యాయినికి పరామర్శ

ప్రజాశక్తి- కవిటి

ఆగంతకుని దాడిలో గాయపడిన ఉపాధ్యాయురాలు బల్లెడ భారతిని జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, జనసేన నాయకుడు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ మంగళవారం పరామర్శించారు. ఉపాధ్యాయురాలిపై జరిగిన దాడి తమను కలిచివేసిందని, ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, మహిళ ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బయటకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీరితో పాటు మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి, సమగ్ర శిక్షా అభియాన్ ఎపిఒ నలినీకాంత్, ఉపాధ్యాయుడు బల్లెడ లక్షణమూర్తి ఉన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి- పొందూరు



సిల్వర్ మెడల్‌తో విద్యార్థిని సంతు

గుంటూరులో ఈనెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించిన 68వ స్కూల్‌గేమ్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-19 బేస్‌బాల్ పోటీల్లో లోలుగు కేజీబివి విద్యార్థిని టి.సంతు ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించింది. విద్యార్థిని సిల్వర్ మెడల్‌ను గెలుపొందడంతో ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయులు రూపవతి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.



పూడికలను తీస్తున్న కార్మికులు

సంతబొమ్మాళిలో పారిశుధ్య పనులు

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మేజర్ పంచాయతీ నారం పాపయ్య వీధిలో సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి ఆధ్వర్యాన మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువపై ఉన్న డ్రెయినేజీ పేట్లను తీసి పూడికలను తీసి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ మహేష్, కార్యదర్శి దుంపల శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఝాన్సీ, సర్పంచ్ ప్రతినిధి కళింగపట్నం అప్పారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. నాక్ టీం సందర్శన ద్వారా కళాశాలకు మంచి గ్రేడ్ పొందడానికి వీలుగా ప్రతిఒక్కరూ తమ వివరాలు https:// gcm-sklm .ac.in/almuni_register.php నమోదు చేయాలన్నారు. అందులో భాగంగా ఈనెల 28న కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థులంతా తప్పక హాజరు కావాలన్నారు. ఈ సమావేశాన్ని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రామకృష్ణ ఆధ్వర్యాన జరుగుతోందని, మరిన్ని వివరాలకు 9948121716, 9494944029 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని చాపర ఎరువుల దుకాణాలను జిల్లా విజిలెన్స్ అధికారి మురళీధర్, పలాస వ్యవసాయ శాఖ ఎడి లింగాల మధుబాబు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల అమ్మకాల్లో నిబంధనలు పాటించాలని యజమానులకు సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ఎఒ దానకర్ణుడు పాల్గొన్నారు.



దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

పెన్షనర్ల హక్కుల పరిరక్షణ ప్రభుత్వానిదే



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న పార్వతీశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాజ్యాంగం ఆదేశిక సూత్రాల ప్రకారం, విశ్రాంత ఉద్యోగులకు గౌరవప్రదమైన జీవితం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని 'ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్' అధ్యక్ష, కార్యదర్శులు దొంతం పార్వతీశం, మణికొండ ఆదినారాయణ మూర్తి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం ఆధ్వర్యాన 'పెన్షనర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ దయాభిక్ష కాదని, ఉద్యోగుల హక్కుగా పేర్కొంటూ 1982లో సుప్రీంకోర్టు తీర్పు నిచ్చిందన్నారు. దీనికి విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ ప్రయోజనాలను వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయన్నారు. యుపిఎస్, సిపిఎస్ రద్దు చేసి ఉద్యోగులందరికి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇపిఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు, కరువు భత్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ సమయంలో విశ్రాంత ఉద్యోగుల సదుపాయాలు జాప్యం లేకుండా చెల్లించాలన్నారు. సిపిఎస్ ఉద్యోగుల సంఘ ప్రతినిధి గురుగుబెల్లి భాస్కరరావు మాట్లాడుతూ ఉద్యోగులకు భవిష్యత్ అనేది లేకుండా చేసిన సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి ఓపిఎస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎడ్యుకేషన్, బ్యాంకు, ఎల్‌ఐసి, బిఎస్ఎన్ఎల్, రైల్వే, స్టీల్ ప్లాంట్, ఆర్అండ్‌బి, పీర్లెస్, మెడికల్ అండ్ హెల్త్, డిసిసిబి, ఆర్‌టిసి, విఎఒ తదితర సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. ఇటీవల మరణించిన విశ్రాంతి ఉద్యోగుల నాయకులు వీరభద్ర స్వామికి సంతాపం తెలిపారు. కోశాధికారి పి సుధాకరరావు వందన సమర్పణ చేశారు.

జాతీయ పెన్షనర్స్ డే సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా పశుసంవర్ధక శాఖ సెమినార్ హాల్లో పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విశ్రాంత న్యాయ ఉద్యోగి శ్యాం అధ్యక్షత వహించారు. ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు హాజరై మాట్లాడారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కూన తవిటి నాయుడు, చింతాడ రామారావు, అధ్యక్షులు నేతింటి రామారావు, కొత్తకోట పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల పెన్షనర్ల సమావేశం ..

ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జాతీయ పెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా రిటైర్డ్ ఉద్యోగులు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ పెన్షన్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గేదెల ఇందిరా ప్రసాద్, గుడ్ల జగ్గారావు, ఎం. సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యాన ..

ఆర్‌టిసి జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ కార్యాలయంలో అధ్యక్షులు ఆర్.పి. రావు అధ్యక్షతన జరిగిన పెన్షన్స్ డే కార్యక్రమంలో డిఎఫ్ఓ ఆకాశపు విజయకుమార్, వైద్య నిపుణులు కింతలి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డు ఉద్యోగులకు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.అప్పారావు, ఎస్-ఎస్ఆర్ శర, సుమన్, రమేష్, జామి ప్రసాద్, ఎం.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా పట్టణంలోని వన్వే జంక్షన్ వద్ద నున్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి పెన్షనర్ల సభ్యులు నివాళ్లర్పించారు. అనంతరం మెయిన్ రోడ్డు గుండా పూజారిపేటలోని వెంకటేశ్వర కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారి హెచ్‌వి సత్యనారాయణ, సబ్ ట్రెజరీ అధికారి ఎస్.సువర్ణ రాజు, సంఘ ఉపాధ్యక్షులు పేడాడ వైకుంఠరావు, ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక పట్టుశాలి కళ్యాణ మండపంలో పొందూరు, జి.సిగడాం మండలాల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అంకం ధర్మారావు అధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు బల్ల సత్యనారాయణ, బరాటం సుబ్బారావు, బి. పోలినాయుడు, చంద్రరావు, తదితరులను దుశ్శాలువ, మెమెుంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిజివిబి మేనేజర్ జి.తిరుమలేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగులు డాక్టర్ వై.మల్లిబాబు, డి.సూరిబాబు, కె.శాంతారాం, మనోరమ, రామకృష్ణ వి. కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న పురుషోత్తం నాయుడు

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవ వేడుకల్లో విశ్రాంత ఉద్యోగుల నాయకులు మోహనరావు, వి.కేశవరరావు, ప్రసాద్, ఎన్.విశ్వనాథ్ పాల్గొన్నారు.

టెక్కలి: విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన ఆర్థికపరమైన లావాదేవీల బిల్లులను పరిష్కరిస్తానని టెక్కలి ఉపఖజానా శాఖ కార్యాలయ ఎటిఒ ఎస్.రామకృష్ణ, ఎస్‌టిఒ ఎం.భాగ్యలక్ష్మి పెన్షనర్లకు హామీనిచ్చారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.రవికుమార్ 70 ఏళ్లు దాటిన 22 మందికి విశ్రాంత ఉద్యోగులకు సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, కార్యదర్శి కె.ధనుంజయరావు, గౌరవాధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, కోశాధికారి బొడ్డ అయ్యబాబు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

యువత విలువలతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి అన్నారు. చిలకపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రత్యేకంగా నిర్వహించిన సంకల్పం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, మాదక ద్రవ్యాల రహిత సమాజానికి దారి చూపిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో సత్ప్రవర్తనతో నడుచుకొని ఉన్నత విద్యను అభ్యసించి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండే విధంగా ప్రతిఒక్కరూ పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం తీర్చిదిద్దడంలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ సంబంధించిన సమాచారాన్ని 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయలని,



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఐజి, ఎస్‌పి, ఎమ్మెల్యే తదితరులు

కళాశాలలో ఏర్పాటు చేస్తున్న పోలీస్ డ్రాప్ బాక్సుల ద్వారా సమాచారం తెలియజేయాలన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం వలన చాలా కుటుంబాలు, యువత నాశనమవుతున్నారన్నారు. అనంతరం ఈగల్ టాస్క్‌ఫోర్స్, డ్రగ్స్ వద్దు బ్రో మాదక ద్రవ్యాలు వలన కలిగే అనర్థాలు తెలిపే ప్రత్యేక పోస్టర్‌ను డిఐజి చేతులమీదుగా ఆవిష్కరించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల సమాచారాన్ని తెలిపేందుకు ప్రతి కళాశాలలో ఏర్పాటు చేస్తున్న డ్రాప్ బాక్సులను కళాశాల యాజమాన్యానికి డిఐజి, ఎస్ఐ అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి రమణ, శివానీ గ్రూప్ ఆఫ్ కాలేజ్ జాయింట్ సెక్రటరీ దుర్గా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ దుర్గాప్రసాద్ రాజు, కళశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, డిఎస్‌పి వివేక ఆనంద్, సిఐలు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

పోలీసులు మానసికోల్లాసానికి, దృఢంగా ఉండడానికి క్రీడలు దోహదం చేస్తాయని విశాఖ డిఐజి గోపీనాథ్ జట్టి, ఎస్‌పి మహేశ్వర రెడ్డి అన్నారు. ఆర్మీడ్ రిజర్వ్‌డ్ మైదానంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. ముందుగా గాలిలోకి శాంతికి చిహ్నం పావురాలు, బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. శారీరిక సామర్థ్యంతో పాటు మానసికోల్లాసం అవసరమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి.రమణ, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, ఎల్.శేషాద్రి, డి.ప్రసాదరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.



గుర్తుతెలియని మృతదేహం

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహం రైల్వేస్టేషన్ బయట రహదారిపై పడి ఉండడంతో రైల్వేస్టేషన్ నుంచి వివిధ పనులపై వెళ్లే ప్రయాణికులు దుర్వాసనకు ముక్కు మూసుకొని అదే రహదారి పైనుంచి రాకపోకలు కొనసాగించారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చనిపోతే ఆర్‌పిఎఫ్ అధికారులు ఎవరూ పట్టించుకోరని, తమ పరిధి కాదని వారు తప్పించుకుంటారని, జిఆర్‌పి పోలీసులు తమ పరిధి కూడా కాదని వారు తప్పించుకుంటారని ఇలా రైల్వేస్టేషన్ ఆవరణలో రెండు, మూడు రోజులు గుర్తు తెలియని మృతదేహాలు పడి ఉండాల్సిందేనని రైల్వే స్టేషన్ ఆవరణలోని వ్యాపారులు, పలువురు ప్రజలు వాపోతున్నారు. రైల్వేస్టేషన్ ఆవరణలో ఒక వ్యక్తి మృతి చెంది 12 గంటల పైబడి కావస్తున్నప్పటికీ మృతదేహాన్ని తరలించడానికి అధికారులు ముందుకు రాకపోవడం శోచనీయమని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారుల తీరు మారాలని పలువురు కోరుతున్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని ఆర్‌ఆర్ కాలనీలో హత్యకు గురైన మహిళ కేసులోని నిందుతుడు సొండి సురేష్‌ను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఆర్‌ఆర్ కాలనీ వెనుక భాగం వైపు ఉన్న సంగమేశ్వర స్వామి కొండపైన ఉన్న నిందితుడు ఆదివారం అర్ధరాత్రి నుంచి పోలీసులకు దొరక్కుండా నానా అగచాట్లకు గురిచేసి చివరకు మంగళవారం ఉదయం కొండ దిగువ భాగాన భవానీ సన్నిధానం వద్ద పోలీసులకు చిక్కినట్లు స్థానికులు తెలుపుతున్నారు. నిందితుడు కొండ దిగువకు వచ్చి మృతురాలు దామోదర పద్మ పెద్ద కూతురు రచ్చ చేసి తనను ఇబ్బందుల పాల్జేసిందని, ఆమెను ఎట్టి పరిస్థితుల్లో చంపి తీరుతానని గ్రామస్తుల దగ్గర చెప్పినట్లు తెలిసింది. ఈ సంఘటనతో మృతురాలి కుమార్తెలు భయాందోళనలకు గురవుతున్నారు. ఆర్‌ఆర్ కాలనీలోని నిందితుడి సామాజిక తరగతికి చెందిన వ్యక్తులు కొంతమంది సహాయ, సహకారాలు అందించినట్లు స్థానికులు పలువురు చెబుతున్నారు. నిందితుడిని పోలీస్ స్టేషన్‌లో ఉంచి పోలీసులు విచారిస్తున్నారు.



గ్రంథాలయాధికారితో మాట్లాడుతున్న ఎంపిపి దీప

గ్రంథాలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలో ఉన్న శాఖా గ్రంథాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎంపిపి కె.దీప అన్నారు. మంగళవారం గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాల యంలో ప్రధాన సమస్యలను గ్రంథాలయాధికారి కె.సునీతను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్డి, ప్రహరీ నిర్మాణం, కిటికీలు, ప్రధాన తలుపులు పాడైనట్లు తెలిపారు. సమస్యలను త్వరిగతిన పరిష్కరించేందుకు తనవంతు చర్యలు తీసు కుంటానని హామీఇచ్చారు.

ఘనంగా 'ఫస్ట్ ఫ్లైట్ డే' వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గాలిలో ఎగురుతున్న పక్షిని స్ఫూర్తిగా తీసుకుని రైట్ సోదరులు విమానాన్ని కనుగొన్నారని, గడిచిన 121 ఏళ్లుగా విమానయాన రంగం ప్రపంచ వ్యాప్తంగా అనేక రూపాలు మార్చుకుని అత్యంత వేగవంతమైన ప్రయాణానికి దోహదపడుతుందని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలోని హిస్టరీ, టూరిజం విభాగాల ఆధ్వర్యాన ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ సహకారంతో 'ఫస్ట్ ఫ్లైట్ డే' వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ పెరుగుతున్న విజ్ఞాన రంగంలో అనేక మంది శాస్త్రవేత్తలు కొత్త అంశాలను కనుగొని భావితరాలకు అందించారన్నారు. సెట్‌శ్రీ మాజీ సిఇఒ సురంగి మోహనరావు మాట్లాడుతూ రైట్ సోదరుల కృషి ఫలితాన్ని నేటి తరాలు అనుభవిస్తున్నాయన్నారు. రైట్ సోదరులు మొదట ఫ్లైట్ ఎగిరిన ప్రాంతమైన నార్త్ కరోలినాలోని 'కిల్ డెవిల్ హిల్స్' ప్రదేశాన్ని తాను సందర్శించానని గుర్తు చేశారు. అటువంటి విమానయాన రంగానికి జిల్లా నుంచి జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే అవకాశం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు దక్కిందన్నారు. ఆయన నేతృత్వాన భోగాపురంలో విమానాశ్రయం శరవేగంగా నిర్మాణ మవుతోందన్నారు. ట్రావెలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నటుకుల మోహన్ మాట్లాడుతూ జిల్లాలో విమానం నడప గలిగిన వ్యక్తి 'గ్రంధి మిలాన్' అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ట్రావెల్స్ అసోసియేషన్ మెంబర్స్ డాక్టర్ బడాన దేవ భూషణ్‌రావు, పొన్నాడ రవికుమార్, ఎస్ .ఎస్. ట్రావెల్స్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరావు, జిల్లా టూరిజం ఆఫీసర్ నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ పి. శంకర నారాయణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణా రావు, డాక్టర్ ఎం. రామజోగి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

అభివృద్ధి పనుల ప్రతిపాదనలు ఆమోదం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీకి మంజూరైన టైడ్ గ్రాంట్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు ప్రతిపాదనలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ముందుగా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మొదటి విడత మంజూరైన టైడ్ గ్రాంట్ రూ.80 లక్షల్లో రూ.40,59,473 చేపట్టే తాగునీటి సరఫరాకు ప్రతిపాదిత పనులు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. రెండో విడత మంజూరైన రూ.79,60,934 మంజూరయ్యాయి. ఇందులో సవరించిన వార్షిక అభివృద్ధి ప్రణాళికను కౌన్సిల్ ఆమోదించింది. దీంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు వచ్చిన టెండర్లు కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపాలిటీలో కొత్త కాంట్రాక్టర్లు లేకపోవడంతో అభివృద్ధి పనులకు జాప్యం ఏర్పడిందని వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి అన్నారు. తన వార్డుకు సంబంధించి పనులకు టెండర్లు పిలిస్తే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పట్టణంలో విచ్చల విడిగా తిరుగుతున్న పశువులు నిరోధించేందుకు చర్యలు తీసుకోవడం లేదని వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, మధుమూర్తి అధికారులను ప్రశ్నించారు. పత్రిక ప్రకటన వరకే పశువులు నిరోధన కనిపిస్తుందని, వాస్తవంగా అమలు చేయడం లేదని అన్నారు. ముందుగా మైక్ ద్వారా రోడ్డుపై పశువులు తిరిగితే చర్యలు తీసుకుంటామని దండోరా వేయించాలని సూచించారు. కౌన్సిల్ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై ప్రోగ్రెస్ గురించి సభ్యులకు సమాచారం ఉండడం లేదని వార్డు కౌన్సిలర్ సుగ్గ ప్రేమ్‌కుమార్ అన్నారు. పురుషోత్తపురంలో జగనన్న కాలనీలో తాగునీటి సమస్య ఉందని, గత సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకున్నారో సమాచారం లేదని అన్నారు. సమావేశంలో మేనేజర్ అప్పలస్వామి, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

ప్రశాంతంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి- పోలాకి

వంశధార శాఖ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం.సురేష్ కుమార్ ఆధ్వర్యాన మంగళవారం వంశధార డిస్ట్రిబ్యూటర్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వంశధార ప్రాజెక్టు పోలాకి డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్‌గా నీటి సంఘాల అధ్యక్షులు ఎంవెంకట అప్పలనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా మెండ రామ్మోహనరావును ఎన్నుకున్నారు. వారికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తమ్మినేని భూషణరావు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, టిడిపి నాయకులు గొండు రామన్న, డోల జగన్, డోల ప్రసాదరావు, లుకలాపు రాంబాబు, బైరి భాస్కరరావు, సూరపు నారాయణదాసు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని కొర్లకోట డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా సనపల ఢిల్లీశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండలంలోని కొర్లకోట హైస్కూల్ వద్ద సాగునీటి శాఖ ఎస్ఇ పొన్నాడ సుధాకర్ ఆధ్వర్యంలో అధికారులు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా సనపల ఢిల్లీశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా దేశిలంక వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన డిస్ట్రిబ్యూటరీ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నూక రాజు, టిడిపి నాయకులు తమ్మినేని అమర్నాథ్, కొర్లకోట సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పల



ఆమదాలవలస : నియామక పత్రం అందజేస్తున్న ఎస్ఇ సుధాకరరావు

నాయుడు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, ఇరిగేషన్ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

పొందూరు: నీటిసంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో గోరింట డిస్ట్రిబ్యూటరీకి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా బొడ్డేపల్లి నీటిసంఘం అధ్యక్షులు దుప్పల జగన్మోహనరావు, ఉపాధ్యక్షులుగా అన్నెపు జనార్ధనరావులు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ రామ్మోహన్, అన్నెపు రాము, బి.శంకరభాస్కర్, గోరింట, పెనుబర్తి, కింతలి, బొడ్డేపల్లి నీటిసంఘం అధ్యక్షులు, ఉపాధ్యకులు, సభ్యులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: జలుమూరు, కోటబొమ్మాళి. సంతబొమ్మాళి మండలాల పరిధిలోని గోవిందపురం డిస్ట్రిబ్యూటరీ కమిటి అధ్యక్షునిగా మండలం లఖందిడ్డికి చెందిన కర్రి అప్పారావును, సంతబొమ్మాళి మండలానికి చెందిన అల్లు రమేష్‌కుమార్‌ను ఉపాధ్యక్షునిగా నీటి సంఘం చైర్మన్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వంశధార నీటిపారుదల కార్యాలయ అవరణలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారి బి.రాంబాబు నీయామక పత్రాలు అందజేశారు. ఎన్నికైన వీరికి పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మండల అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ అభినందించారు.

టెక్కలి : టెక్కలి వంశధార ప్రాజెక్టు పరిధి నౌపడ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షునిగా నందిగాం మండలం దేవలభద్ర నీటి సంఘ అధ్యక్షులు మళ్లా బాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రావివలస నీటి సంఘ అధ్యక్షులు సుగ్గు పోతయ్య ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా ఇఇ డి.శేఖరరావు వ్యవహరించారు. నౌపడ డిస్ట్రిబ్యూటరీ నీటి సంఘ పరిధిలో రావివలస, బన్నువాడ, తిర్లంగి, భూరగాం, రౌతుపురం, దేవళభద్ర, నందిగాం, హను మంతునాయుడుపేట, డి.జి.పురం నీటిసంఘాలు ఉంటాయి.

పలాస : స్థానిక వంశధార కార్యాలయం ఆవరణలో టిసిలు గొనప నిరంజన్, అట్టాడ జనార్ధన్, తారకేశ్వరరావు, దువ్వాడ అప్పారావు, శిష్టు మురళి, దాసరి దాశరథి. కవిటి విశ్వనాథం, అట్టాడ జగన్నాథరావులకు నియాకమ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, సప్ప నవీన్, అంబటి కృష్ణమూర్తి. యవ్వారి మోహనరావు, దడియల నర్సింహులు. డెప్యూటీ డైరెక్టర్ ఎం.వి.రమణ, వంశధార డిఇఇ బి.సత్యనారాయణ, ఎఇ రాజశేఖర్ పాల్గొన్నారు.



నాటుసారా ప్యాకెట్లతో పోలీసులు

నాటుసారాతో ఇద్దరు అరెస్టు

కంచిలి: అక్రమంగా నాటుసారా ప్యాకెట్లను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 36 లీటర్ల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కె.బేబి తెలిపారు. నాటుసారా అరికట్టడంలో భాగంగా సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా పద్మతుల కూడలి వద్ద బిపి కాలనీకి చెందిన ఎస్.మహేష్, మున్సిపేటకు చెందిన కె. మోహనరావులు 36 లీటర్ల నాటు సారా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నాటు సారా అక్రమ రవాణాపై సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక

మందస: మందస మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎంపిడిఒ పైల సూర్యనారాయణ, ఎపిఎం పి.కూర్మారావు ఆధ్వర్యాన ఎన్నుకున్నారు. మండల పంచాయతీ కార్యదర్శులు ప్రధాన సలహాదారుడుగా కుప్పిలి జయప్రకాష్, అధ్యక్షులు నెయ్యిల మోహనరావు, ఉపాధ్యక్షులు కుర్మా రావు, నవీన్‌కుమార్, జీవన్‌రావు, ప్రధాన కార్యద ర్శులుగా కల్పన సంపతి, సహజ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సోమేష్, ఈశ్వరరావు, పద్మావతి, మనోజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటేరియల్‌గా రవి శంకర్, నందిని, మురళి, శేషగిరిరావులను ఎన్నుకున్నారు.



నియామకపత్రం అందజేస్తున్న ఎంపిడిఒ


జ్ఞాపికలతో రక్తదాతలు

రక్తదాతలు ప్రాణదాతలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రక్తదాతలే ప్రాణదాతలని అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు అన్నారు. సంఘం ఏర్పాటై ఏడేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా టెక్కలి జిల్లా ఆస్పత్రిలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం నిరుపేద కుటుంబాలకు 25 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువుల పంపిణీ చేశారు. రోగులకు నగదు సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సామాజిక స్పృహతో తోచిన సాయం నిరుపేదలకు చేయాలని కోరారు. ఎంత ఖర్చుపెట్టినా తయారు కానిది రక్తం ఒక్కటేనని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.సూర్యారావు రక్తదాతలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అభయం యువజన సేవా సెక్రటరీ లాడే కామేశ్వరరావు, సంఘ సభ్యులు ఎస్.సింహాచలం, ధర్మవరపు పూర్ణాచారి, అద్దాల వీరభద్రాచారి, జామి సుబ్బారావు, ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న వెంకట త్రినాథరావు

షర్మిల జన్మదిన వేడుకలు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను మంగళవారం జిల్లా కాంగ్రెస్ అధ్వర్యాన నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు, ఇన్‌ఛార్జి గాదం వెంకట త్రినాథరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కెవిఎల్ ఈశ్వరి కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు బొత్స వెంకటరమణ, బస్వా షణ్ముఖరావు, కొత్తకోట రాం ప్రసాద్, అంబటి దాలినాయుడు, గొల్లపల్లి దాలయ్య, షాన్ భాష, ఉస్మాన్, షబీర్ బేగ్, అంబటి లక్ష్మణరావు, రమేష్ కుమార్, సురియా బేగం, చోడవరపు లీలావతి, జరీనా, బగ్గు రాము, కొండలరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులే కీలకం


లావేరు : మాట్లాడుతున్న బాలకృష్ణ

ప్రజాశక్తి- లావేరు

గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులది కీలకపాత్రని మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన రెండవ రోజు శిక్షణా కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆలోచనలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటు పడాలన్నారు. ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి. వెంకటరాజు, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఇఒపిఆర్‌డి వి.విశ్వేశ్వరరావు, ఎంపిటిసిల సంగం మండల అధ్యక్షుడు జగ్గారోతు తవిటినాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

కవిటి: మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన రెండు రోజుల ఎస్‌డిజి శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో స్వయం సమృద్ధితో కూడిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు కావాలన్నారు. మహిళా స్వేచ్ఛ, స్నేహపూర్వక వాతావరణం గ్రామాల్లో నెలకొల్పాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రహి, ఎఒ దుర్గాప్రసాద్, ఎపిఎం గోవిందరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : పంచాయతీల్లో సుపరిపాలనే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిదులు పనిచేయాలని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి మంగళవారం రెండో రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎస్.రాజేశ్వరి, ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగాం : మండల పరిషత్ సమావేశ మందిరంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లకు, అధికారులకు


కవిటి : శిక్షణలో పాల్గొన్న అధికారులు సిబ్బంది

నిర్వహించిన శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ శిక్షణా తరగతుల్లో ఎంపిడిఒ టి.రాజారావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు కె.గోపీనాథ్, లక్ష్మణరావు, మండల పరిషత్ ఎఒ ధనలక్ష్మి, కార్యదర్శులు కె.సంతోష్‌కుమార్, పద్మనాభం, శ్రీనివాసరావు, ఎపిఒ మనోరత్నం, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

కంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లకు, మండల స్థాయి అధికారులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు స్థానికీకరణ అంశంపై ట్రైనీలు వై.విశ్వనాథం, ఎ.తులసయ్య శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం


ఆమదాలవలస : తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు

ప్రజాశక్తి- లావేరు

రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని భూ సమష్యలు పరిష్కరించుకోవాలని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. మంగళవారం గురుగుబిల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు భూ సమస్యలుంటే గ్రామసభల్లో పరిష్కరించుకోవాలన్నారు. గురుగుబిల్లిలో 10 సమస్యలపై వినతిపత్రాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బి.శ్రీధర్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, సర్పంచ్ బాడిత లక్మణరావు, సాగునీటి సంఘం అధ్యక్షుడు బాడిత చిట్టిబాబు, రేషన్ డీలర్ హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : క్షేత్రస్థాయిలో వివిధ రకాల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్. రాంబాబు అన్నారు. మంగళవారం పురపాలక సంఘం పరిధిలోని పార్వతీశ్వరుని పేటలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ ఎస్.రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన భూ సంబంధిత సమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించి పలు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ బి.గోపి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.గోవింద, విఆర్‌ఒ డి.రాజులు, టిడిపి నాయకులు గురుగుబెల్లి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


లావేరు : వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న తహశీల్దార్ జోగారావు

మెళియాపుట్టి : రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహశీల్దార్ బడే పాపారావు సూచించారు. మండలంలోని గంగరాజపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ మేరకు 11 వినతులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, సర్వే డిటి వెంకటరావు, సర్పంచ్ ప్రతినిధి శంకరరావు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి- పొందూరు

బొర్రపుట్టుగ పాఠశాల హెచ్‌ఎంపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రశన్న డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయునిలు మారుమూల గ్రామాల్లో పాఠశాలలకు, ఉద్యోగాలకు వెళ్లడానికి భయపడు తున్నారన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి మహిళా ఉద్యోగుల్లో భయం పోయేలా చూడాలన్నారు.

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాన్ని మంగళవారం సినీనటుడు సంపూర్ణేష్ బాబు కుటుంబ సమేతంగా సందర్శిఃచారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించే సేవల్లో పాల్గొన్న అనంతరం అనివెట్టి మండ పంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఎ.శోభనా ద్రాచార్యులు శేష వస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని అందజేశారు. అలాగే సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి.వావా అరసవల్లిని సందర్శించారు. ఆయనతో పాటు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, అధికారులు హాజరయ్యారు.

ఎంఇఒ-2గా చిట్టిబాబు

కవిటి: కవిటి ఎంఇఒ-2గా కె.చిట్టిబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కంచిలి ఎంఇఒ-2గా బాధ్యతలు నిర్వహిస్తున్న చిట్టిబాబుకు కవిటికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ధనుంజయ మజ్జి, కార్యాలయ సిబ్బంది సంతోష్, శ్రీను, తులసి, రామకృష్ణ, తనుజ, రామారావు, పోరామో, కృష్ణ, అరుణ్, కృష్ణ అభినందనలు తెలిపారు.

మోసాలపై అప్రమత్తం

ఇచ్ఛాపురం : సమాజంలో జరుగుతున్న నేరాలు, మోసాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్ఐ చిన్నంనాయుడు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా కస్పా జాలరీ వీధిలో సంకల్పం, ఉమెన్ సేఫ్టీ, సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

పాతపట్నం : విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. పాతపట్నంలోని అక్షర పాఠశాలలో సంకల్పంలో భాగంగా ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అక్షర పాఠశాల యాజమాన్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేట్ బస్సు ఛార్జీల ధరలు తగ్గించాలి


పర్లాకిమిడి: ప్రయివేటు బస్సుల ఛార్జీల ధరలను తగ్గించాలని కాశీనగర్ పౌర మహాసభ అధ్యక్షులు ప్రశాంత్ మిశ్ర డిమాండ్ చేశారు. గజపతి జిల్లా కాశీనగర్ పట్టణం స్టేట్ బ్యాంకు కూడలి వద్ద ప్రయివేట్ బస్సుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ధర్నా చేపట్టారు. ప్రయివేట్ బస్సులు బైపాస్ మీదుగా వెళ్తున్నాయని, అవి ఊర్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వం నిర్వహిస్తున్న లక్ష్మి బస్సులు అందరికీ అందుబాటులో ఉండేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాశీనగర్ తొమ్మిదో వార్డు కౌన్సిలరు కటికి రామారావు, మెడిబోయిన సృజన్‌కుమార్, రవి పండా, త్రినాథ్‌నాయక్, ప్రశాంత్ సాహు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సభ్యులు

తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

వడ్డివాడ రైల్వే వంతెన పనులు కొలిక్కి


వడ్డివాడ రైల్వే గేటు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

సంతబొమ్మాళి మండలం వడ్డివాడ-బోరుభద్ర రహదారిపై వడ్డివాడ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఒబి) మంజూరు చేస్తూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే శాఖ గెజిట్ చేసింది. దీంతో నౌపడ- కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ల మధ్య వడ్డివాడ గేటు (714/3-5 కి.మీ) వద్ద పైవంతెన పనులు త్వరలో నిర్వహిస్తామని ఈస్ కోస్ట్ రైల్వే చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్ సమల్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో మేఘవరం, మరువాడ, మలగాం, జగన్నాథపురం, ఉమిలాడ, బోరుభద్ర, కొల్లిపాడు, పాలతలగాం గ్రామాల ప్రజలకు, ఇటూ సంతబొమ్మాళి మండల కేంద్రానికి, కోటబొమ్మాళి, టెక్కలి, శ్రీకాకుళం వైపు వేల సంఖ్య వాహనదారుల కష్టాలు తీరుతాయి. ఈ మార్గంలో రైల్వే గేటు వల్ల సమయం వృథా, ఎండ, వాన, ఎగసిపడుతున్న దుమ్ము, ధూళి రేణువుల సమస్యను వాహనదారులు ఎదుర్కొని పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. తీర ప్రాంతాల మత్స్యకారులు అత్యవసర అంబులెన్స్ సేవలకు అంతరాయం ఏర్పడుతున్న సందర్భాలు ఉన్నాయి. అత్యవసర సమయంలో గేటు వేయడంతో ప్రయాణికులు రైళ్లను తప్పిపోతున్నారు. ఈ వంతెన మంజూరుపై ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- పలాస


తిరుమల

68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఆధ్వర్యాన ఉత్తర ప్రదేశ్ అయోధ్యలో 17 ఏళ్లలోపు ఖోఖో పోటీలకు పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బడే తిరుమల జాతీయస్థాయి పోటులకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయులు డి.దాశరథి తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 21 నుంచి నిర్వహిస్తారని తెలిపారు. తిరుమలకు వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావులు, ఉపాధ్యాయులు చిట్టిబాబు, ఎస్ఎంసి ఛైర్మన్ కె.తాతయ్య, సిబ్బంది అభినందించారు.


పరిశీలిస్తున్న ఎంపిడిఒ తిరుమలరావు

ఆధార్ కేంద్రం తనిఖీ

కంచిలి : మండలంలోని డోలగోవిందపురం సచివాలయం వద్ద నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్ కేంద్రాన్ని ఎంపిడిఒ తిరుమలరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆధార్ కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను గురించి ఆరా తీశారు. ప్రజలతో పాటు విద్యార్థులు ఈ ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పోలేరు సచివాలయాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు అందజేశారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు.